క్లుప్తంగా

వాహనాల తనిఖీ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలు సేకరించి వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. అలాగే లైసెన్సులు, హెల్మెట్‌లు లేని వారికి జరిమానా విధించారు. తనిఖీల్లో ఏఎస్సై సుబ్బారావు, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్‌గా దేవేందర్



ఎస్ఎస్‌తాడ్వాయి: కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్‌గా బొల్లు దేవేందర్‌ను పార్టీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క నియమించారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న దేవేందర్ సేవలను గుర్తించి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ నాయకులను, ప్రజాప్రతినిధులను, యువజన సంఘాల నాయకులను కలుపుకుని పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో నియమించిన ఎమ్మెల్యే డాక్టర్ సీతక్కకు, పార్టీ జిల్లా నాయకత్వానికి దేవేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ గ్రామంలో పవన్‌కల్యాణ్ సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. రొయ్యూర్ చెక్ పోస్టు సమీపంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసినట్లు యూత్ సభ్యులు భద్రాద్రి, పవన్‌లు తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మంగపేట: మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. వేసవి కాలం కావడంతో పాటు మండుతున్న ఎండలు, వడగాలుల నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ పాకెట్లు అందచేసినట్లు నాగరమేష్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ములుగు రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఇంచర్లలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమలాపూర్ గ్రామానికి చెందిన మోరె ఆగయ్య (70) ఇంచర్ల గ్రామానికి చెందిన తన కుమార్తె గోస్కుల శారద ఇంటికి శుక్రవారం వచ్చాడు. శనివారం ఉదయం 6.30 నిమిషాలకు ఇంటి సమీపంలో ఉన్న కొట్టంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమార్తె శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు తెలువడంతో ఎస్సై రేక అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 సెల్‌ఫోన్లు, మూడు కోడి పుంజులు, రూ 36,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోడి పందేలు ఆడుతున్న 11 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

తీర్మానం వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహామూర్తి

వెంకటాపురం(కె): ఆదిమ తెగల్లో 11 గిరిజనేతర కులాలను కలపాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆదివాసీ నవనిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహామూర్తి, రాష్ట్ర అధ్యక్షులు వాసం నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో ఆదివాసీ నవనిర్మాణ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీలను అణగతొక్కాలని చూస్తుందని అన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ఆదివాసీలను నయవంచన చేశాడన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి రావటం కోసమే ఆదిమ తెగలను బలి పశువులను చేస్తున్నారని అన్నారు. గిరిజనేతర కులాలను కలపడాన్ని వ్యతిరేకిస్తూ ఆది వాసీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బర్లగూడెం సర్పంచ్ నర్సింహా మూర్తి,మహేష్, భవాని, ఇర్పబాబు, శివ, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన సర్వర్



గ్రామానికి స్వర్గరథం బహూకరిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

ములుగు రూరల్: పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి ఎండీ.సర్వర్ అని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. శనివారం సర్వర్ 36వ వర్ధంతి నిర్వహించారు. మండలంలోని రాంచంద్రాపూర్‌లో సర్వర్ స్మారక స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కామ్రేడ్ సర్వర్ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని అన్నారు. అనంతరం తన తండ్రి జ్ఞాపకార్థం రాంచంద్రపూర్ గ్రామపంచాయతీకి సర్వర్ చారిటబుల్ ట్రస్టు నుంచి స్వర్గరథం బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ హట్కర్ కల్పన రూప్‌సింగ్, ఎంపీటీసీ భూక్య అమృత, ఉప సర్పంచ్ వేములపల్లి అశోక్, కోటేశ్వర్, దొంతి రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజమౌళి, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంసీపీఐయూ నాయకులు గుండబోయిన చంద్రయ్య, ప్రజా సంఘాల చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షను విజయవంతం చేయాలి

ములుగు: గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షను విజయవంతం చేయాలని విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొల్తీయ సారయ్య, దాస్ శనివారం ఓ ఉమ్మడి ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిరసన కొనసాగుతుందని అన్నారు. ప్రతినెలా సకాలంలో పెన్షన్ రాకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 నుంచి బకాయి పడిన మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళలకు వరం.. ‘సమ్మాన్ సేవింగ్ స్కీం’

మహాముత్తారం : తపాలాశాఖ ఆడపిల్లలు, మహిళల కోసం అతితక్కువ వడ్డీతో ప్రత్యేకంగా మహిళ సమ్మాన్ సేవింగ్స్ కొత్తం స్కీంను రూపొందించిందని మంథని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ హజారుద్దీన్ సయ్యద్ శనివారం తెలిపారు. రూ.1000, గరిష్టంగా రూ.2 లక్షలతో ప్రారంభించవచ్చని ఈ డిపాజిట్లపై 7.5 శాతం వడ్డీ ప్రతీ త్రైమాసికానికి చక్రవడ్డీతో వస్తుందని వివరించారు. ఒక్కసారి ఖాతా ప్రారంభించిన తర్వాత మూడు నెలల వరకు వడ్డీ తెరవడానికి వీలు లేదన్నారు. అదే విధంగా మొత్తంగా రూ.2 లక్షలకు మించరాదు ఒక్క సంవత్సరం తర్వాత 40 శాతం మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు సమాచారం కోసం మీ దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించాలని కోరారు.

మహాధర్నాకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



ములుగు నుంచి ధర్నాకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

ములుగు: మోదీ హటావో..సింగరేణి బచావో నినాదంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో నిర్వహించిన మహాధర్నాకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పిలుపు మేరకు శనివారం ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ములుగు జిల్లా కేంద్రం నుంచి మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రైవేటు వాహనాల ద్వారా వందలాదిగా వెళ్లారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ములుగు పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, యువజన విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోగిల మహేష్, సాగర్, రాజా హుస్సేన్, అజహర్, దాసరి రమేశ్, లియాఖత్ అలీ, సగేష్, ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్

కన్నాయిగూడెం: ప్రభుత్వం నుంచి వస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురంలో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు నాగమణి, సుమకు చెక్కులు ప్రభుత్వం నుంచి అందడంతో ఆయన గ్రామస్తులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మైనారిటీ ఉప అధ్యక్షుడు మహీముద్,యూత్ జిల్లా అధ్యక్షుడు బోట నాగేష్, మైనారిటీ, మండల అధ్యక్షుడు యా కూబ్ పాషా, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాలపండ్లకు భలే డిమాండ్



ఏటూరునాగారంలో పాలపండ్లు విక్రయిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం: అడవిలో అరుదుగా లభించే పాలపండ్లకు భలే డిమాండ్ ఉంది. మార్కెట్‌లోకి అటవీప్రాంతాల్లోని గిరిజనులు పెద్ద ఎత్తున పాలపండ్లను తీసుకొచ్చి పావుసేరు గ్లాసుకు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. అడవిలో చెట్ల అంతరించి పోతుండడంతో మార్కెట్‌లోకి చాలా తక్కువగా వస్తున్న పాలపండ్లను ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేశారు. అరకిలో రూ.100 చొప్పున విక్రయించ డం గమనార్హం. కంతనపల్లి, ముల్లకట్ట, గొత్తికోయగూడేల్లోని గిరిజనులు వీటిని ఎక్కువగా సేకరించి మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు



పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

చిట్యాల: మండలంలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటీవల రాష్ట్రంలో సంచలనం కలిగించిన పేపర్ లీకేజీ నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు కేంద్రాలకు వెళ్లి తనిఖీలు చేపట్టారు. గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే అదుపులోకి తీసుకొని విచారించి వదిలివేశారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంత నిర్వహించినట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్ ప్రకటనలో తెలిపారు. గణిత పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాల్లో 3651 మంది విద్యార్థులకు గాను 3647 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల్లోని పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు, జాయింట్ డైరెక్టర్ రాజీవ్ తనిఖీ చేశారు.

వామపక్ష పార్టీల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

భూపాలపల్లి అర్బన్: దేశ ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు జిల్లా కేంద్రంలో శనివారం వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని జయశంకర్ సెంటర్‌లో నిరసన చేపట్టగా, సీపీఎం ఆధ్వర్యంలో గణేష్‌చౌక్‌లో నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేటీకే ఓపెన్‌కాస్టు–2లో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సింగరేణి ప్రైవేటీకరణను నిలిపివేయాలని, కార్మిక చట్టాల సవరణను రద్దు చేయాలని, రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ నాయక్

భూపాలపల్లి రూరల్ : ఫారెస్టు అధికారుల వేధింపులకు గురై మృతి చెందిన భుక్యారాజునాయక్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి న్యాయం చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భుక్యా సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మల్హర్ మండలంలోని ఎడ్లపల్లి శివారులో రాజునాయక్ గత 20 ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకోగా, 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 4.26 ఎకరాలకు పట్టా ఇచ్చిందన్నారు. ఇటీవల రొయ్యూరు రేంజ్ ఫారెస్టు అధికారులు రాజునాయక్‌ను ఆ భూమిలో వ్యవసాయం చేసుకోకుండా అడ్డుకోవడం, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడంతో భూమి దక్కదనే బెంగతో రాజునాయక్ గుండెపోటుతో రెండురోజుల క్రితం మరణించాడన్నారు. రాజునాయక్ మృతికి కారకులైన ఫారెస్టు అధికారులపై చర్యలుతీసుకోవాలని కోరారు. సమావేశంలో సేవాలాల్ సేన నాయకులు వాలునాయక్, శారదభాయి, రాంసింగ్, రవీందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అధికారులను వెంటనే అరెస్ట్ చేయాలి

టేకుమట్ల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం ఎడ్లపల్లికి చెందిన భూక్యా రాజునాయక్ మృతికి కారణమైన అటవీ శాఖ అధికారులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రేణుకుంట్ల రాము మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రాజయ్య హాజరై మాట్లాడారు. అటవీశాఖ అధికారుల వేధింపులు తాళలేక మనోవేదనకు గురై రాజునాయక్ మృతి చెందాడని అన్నారు. ప్రాణప్రాయం తప్పిన అనంతరం ఇటీవల ఢిల్లీలోని ఎస్టీ కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేయగా మరోసారి ఫారెస్ట్ అధికారులు మళ్లీ భూమి సాగు చేయకూడదని బెదించడంతో మనోవేదనకు గురై రాజు గుండె ఆగి మృతి చెందాడని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాజునాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారపెల్లి రాయకొమురు, అంబాల ఆనందం తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లికి తరలిన నాయకులు



ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మల్హర్: సింగరేణిని బొగ్గు గనుల వేలానికి కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో శనివారం చేపట్టిన ధర్నా కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. సింగరేణి కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొని బీజేపీ హఠావో..! సింగరేణి బచావో..! అంటూ నినాదాలు చేశారు. తరలిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, నాయకులు కోట రవి, వాల యాదగిరిరావు, తాజోద్దీన్, పుట్టపాక శ్రీనివాస్, రావుల మొగిళి, నారాయణ, శ్రీశైలం, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సుమన్, తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



కిరణ్ (ఫైల్)

మహదేవపూర్: మండలంలోని బొమ్మాపూర్ గ్రామానికి చెందిన కొడెల కిరణ్(19) కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి కిరణ్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై భవానిసేన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మహాముత్తారం: మండలంలోని గండికామారంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం స్థానిక సర్పంచ్ నేరల్ల రమ కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ఈజీఎస్ నుంచి రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

బీజేపీ ప్రభుత్వంలోనే దేశం ముందుకు



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న పార్టీ నాయికులు

భూపాలపల్లి రూరల్: బీజేపీ ప్రభుత్వంలోనే దేశం అభివృద్ధిలో ముందుకెళ్తుందని, రానున్నది రాష్ట్రంలో బీజేపీయేనని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం పార్టీ మండల రూరల్ అధ్యక్షుడు విష్ణు ఆధ్వర్యంలో మండలంలోని కమలాపూర్, రాంపూర్, దూదేకులపల్లి, దీక్షకుంట, గొల్లబుద్దారం, పంబాపూర్ గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కర పత్రాలు పంచారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలోని పేద మధ్య తరగతి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారన్నారు. వైద్యంకోసం ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లిన ఆయుష్మాన్ భారత్ కింద రూ. 5 లక్షల వరకు ఖర్చు భరిస్తుందన్నారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ పిల్లలకు రూ.4 వేల చొప్పున ప్రతినెలా అందించనున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని, రాబోయే రోజుల్లో కేసీఆర్ కుటుంబాన్ని వెలివేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంపత్, కంబాల రాజయ్య, సూర మహిపాల్, చెక్క శంకర్, నాంపల్లి కుమార్, మామి డి చెట్టు స్వామి, నీలాల నర్సయ్య, గాదం దేవేందర్ కందాడి నర్సయ్య, సత్తి రెడ్డి, బిలుగు రవి రాజా, బెల్లంకొండ గోపి, అప్పల వీరయ్య, పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్‌ను నిర్వహిస్తున్న క్రైస్తవులు

భూపాలపల్లి అర్బన్: గుడ్‌ఫ్రైడే ఈస్టర్ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ శివారు సీఆర్ నగర్ నుంచి మంజూర్‌నగర్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, వైస్‌చైర్మన్ హరిబాబు, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న జర్నలిస్టు మృతి



సారయ్య (ఫైల్)

కాటారం: మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మండల సీనియర్ జర్నలిస్టు నారమల్ల సారయ్య (49) శనివారం మృతి చెందాడు. మార్చి 20న సారయ్య చింతకాని క్రాస్‌వద్ద బైక్‌పై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన వాహనదారులు చికిత్స నిమిత్తం స్థానికం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అదే రోజు రాత్రి వరంగల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు అటు నుంచి హైద్రాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి పూర్తిగా విషమించడంతో శనివారం మృతి చెందాడు. సారయ్య గత 28 ఏళ్లుగా పలు పత్రికల్లో మండల విలేకరిగా పని చేశాడు. సారయ్య మృతి పట్ల జర్నలిస్టు యూనియన్ల నాయకులతో పాటు మండల పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ మహిళా కమిటీ



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల గ్రామంలో కాంగ్రెస్ మహిళ గ్రామ కమిటీని మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శీలం మమత, ఉపాధ్యక్షురాలు బండెం విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కూన పోచక్క, కోశాధికారిగా కోట సమ్మక్క, సంయుక్త కార్యదర్శిగా గుంటి పోశక్క, ప్రచార కార్యదర్శిగా పులిగంటి సౌజన్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, ఉపసర్పంచ్ సురేష్, లక్ష్మయ్య, పాల్గొన్నారు.